ప్రభుత్వ పాఠశాలలో సీపీఆర్‌పై అవగాహన



కీసర: కీసరలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు 108 సిబ్బంది సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితిలో సీపీఆర్ నిర్వహణ, సీపీఆర్ చేసే క్రమంలో పాటించే నియమనిబంధనల గురించి విద్యార్థులకు వివరించారు. రోడ్డు ప్రమాదాలు, పాముకాటు తదితర అత్యవసర సేవలపై అవగాహన కల్పించారు. 108 ఈఎంటీ శివనాగేశ్వర్‌రావు, పైలట్ ప్రభాకర్, స్కూల్ హెడ్‌మాస్టర్ రాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



ప్రతిష్ఠాపనోత్సవంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాపసింగారంలో శ్రీ కంఠ మహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా జరిగింది. గురువారం జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ మేయర్ అమర్‌సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ శివకుమార్, మాజీ సర్పంచ్ వంగూరి శివశంకర్, మాజీ ఉపసర్పంచ్ అబేదాబేగం, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు బద్దం కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

మద్యం దుకాణాలకు 1250 దరఖాస్తులు



దరఖాస్తు చేసుకుంటున్న వ్యాపారస్తులు

మేడ్చల్: మద్యం షాపుల కేటాయింపుల్లో భాగంగా జిల్లాలో ఉన్న 118 మద్యం దుకాణాలకు గురువారం నాటికి 1250 దరఖాస్తులు అందాయని మేడ్చల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నవనీత తెలిపారు. నియోజకవర్గంలోని పీర్జాదిగూడలో ఏర్పాటు చేసిన సెంటర్‌లో మద్యం వ్యాపారంపై ఆసక్తి ఉన్నవారు గురువారం వరకు 1250 దరఖాస్తులు ఇచ్చారని తెలిపారు. స్థానిక వ్యాపారులతో పాటు ఇతర రాష్ట్రాల వ్యాపారులు డ్రాలో పాల్గొనేందుకు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. రేపటితో దరఖాస్తు తేదీ ముగుస్తుండటంతో వ్యాపారంపై ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అమ్మవారి విగ్రహం చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

పరారీలో మరి కొందరు

జవహర్‌నగర్: దుర్గమ్మ విగ్రహం ఎత్తుకెళ్లిన కేసులో ఓ అనుమానితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ అరుంధతినగర్‌లోని దుర్గామాత ఆలయంలో విగ్రహం ధ్వంసమై, వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. కాలనీవాసులు ఓ అనుమానితుడిని పట్టుకుని ప్రశ్నించగా.. మరి కొందరు వ్యక్తులతో కలిసి దొంగతనానికి పాల్పడినట్లు తెలిపాడు. దీంతో స్థానికులు జవహర్‌నగర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శివశంకర్ (27)ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు విచారించగా.. తాను మరికొందరితో కలిసి దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించాడు. మిగిలిన నిందితులు పరారీలో ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం



రామంతాపూర్: ఓల్డ్ రామంతాపూర్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో కేంద్రప్రభుత్వ జీఎస్టీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో భాగంగా పలువురు మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో పరిశుభ్రత, స్వచ్ఛత పాటిస్తే ఆరోగ్యంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. బాలల సాహిత్య అవార్డు గ్రహీత వెంకటరమణ, జీఎస్టీ కమిషనర్ శ్రీనివాస్‌తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత పాల్గొన్నారు.

సమస్యల సుడిలో ఎన్నాళ్లు ?

పూర్తిగా ధ్వంసమైన 30 ఫీట్ల రోడ్డు

- నిరుపయోగంగా మారిన కమ్యూనిటీ భవనం
- లో వోల్టేజీ, తాగునీటి సమస్యలతో నిత్యం సతమతం



కూల్చివేసి వదిలేసిన కమ్యూనిటీహాల్



30 ఫీట్ల రోడ్డుపై దెబ్బతిన్న మ్యాన్‌హోల్

కుషాయిగూడ: 2002లో ఏర్పాటైన మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, కైలాసగిరి కాలనీవాసులు సమస్యల సుడిలో కొట్టుమిట్టాడుతున్నారు. అప్పట్లో జిల్లా మంత్రిగా ఉన్న దేవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వభూమిలో లే అవుట్ చేసి, పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. నాటి నుంచి నేటి వరకు కాలనీలో పూర్తిస్థాయిలో మౌలికవసతులు కల్పించడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చాలా రోజుల క్రితం వేసిన 30 పీట్ల రోడ్డు పూర్తిగా దెబ్బతింది.

నిరుపయోగంగా కమ్యూనిటీహాల్..

ప్రజల అవసరాల కోసం నిర్మించిన కమ్యూనిటీహాల్ నిరుపయోగంగా మారింది. కాలనీలో కలుషిత తాగునీరు, లో వోల్టేజీ సమస్యలతో నిత్యం సతమతమవుతున్నామంటూ.. కాలనీవాసులు వాపోతున్నారు.

ఇళ్ల అసెస్‌మెంట్ మరో సమస్య..

చాలా ఏళ్ల క్రితం వేసిన రోడ్డు పూర్తి స్థాయిలో గుంతలమయంగా మారింది. రోడ్డు కింది భాగమంతా చాలాచోట్ల పందికొక్కులు తవ్వేయడంతో సీసీరోడ్డు డొప్పగా మారింది. భారీ వాహనాలు రోడ్డుపై నుంచి వెళ్తే రోడ్డు కుంగిపోయే ప్రమాదం ఉంది.

కూల్చేశారు.. వదిలేశారు..

ఇక కాలనీలో తాత్కాలికంగా రేకులతో ఏర్పాటు చేసుకున్న కమ్యూనిటీ భవనాన్ని కూల్చేసి వదిలేశారు. దీంతో కాలనీలో కమ్యూనిటీహాల్ లేకుండా పోయింది. ఎన్నికల సమయంలో నాయకులు హామీలిచ్చిన కమ్యూనిటీహాల్ నిర్మాణం ముందుకు సాగడం లేదంటున్నారు. ఏదైనా కాలనీ సమస్యలు, అభివృద్ధి వంటి అంశాలపై చర్చించుకుందామనుకున్నా.. కనీసం నీడ లేకుండా పోయిందంటున్నారు.

కలుషిత నీటి సరఫరా..

కాలనీలో తరచుగా కలుషిత తాగునీరు సరఫరా అవుతోంది. బురద రంగులో వచ్చే నీటిని తాగుతూ.. ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. రక్షిత తాగునీరు సరఫరా జరిగేలా చూడాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

750కి పైగా కుటుంబాలు నివాసం..

సుమారు కాలనీలో 750కి పైగా కుటుంబాలు నివాసం ఉంటాయి. కాలనీ మొత్తంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే ఉండటంతో తరచుగా కాలనీలో లో వొల్టేజీ సమస్య తలెత్తుతోంది. విద్యుత్ వినియోగం పెరిగితే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం, అధికారుల చుట్టూ తిరగడం వంటి ఇబ్బందులు పడుతున్నారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి తగినట్లుగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యకు పరిష్కరించాలని కోరుతున్నారు.

ట్యాక్స్‌లు కట్టేందుకు సిద్ధంగా ఉన్నాం..

ఇక కాలనీలో మరో ప్రధాన సమస్య ఇళ్ల అసెస్‌మెంట్. చాలా రోజులుగా తమ స్థలాలను అసెస్‌మెంట్ చేస్తే ట్యాక్సులు కట్టుకుంటామని స్థానికులు అంటున్నారు.

హామీలు మరిచిన నేతలు



ప్రజల అవసరాలకు రేకులతో ఏర్పాటు చేసుకున్న కమ్యూనిటీహాల్‌ను కూలిచ్చేసి వదిలేశారు. ఎన్నికల సమయంలో నేతలు వాగ్దానాలు చేసి కూల్చివేసి మరిచిపోయారు. ప్రజా ప్రతినిధులు స్పందించి కమ్యూనిటీహాల్ నిర్మాణం చేపట్టాలి.

– జిల్లపల్లి యాదగిరి, స్థానికుడు

అధికారులు చొరవ తీసుకోవాలి



కై లాసగిరిలో నెలకొన్న సమస్యలపై అధికారులు చొరవచూపాలి. ప్రధానంగ ధ్వంసమైన 30 పీట్ల రోడ్డుకు తక్షణ మరమత్తులు చేయాల్సిన అవసరం ఉంది. చాలా రోజులుగా వేచిచూస్తున్న అసెస్‌మెంట్ సమస్యపై ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవచూపాలి. ట్యాక్సులు కట్టుకునేందుకు సిద్ధంగా ఉన్నాం.

– దుర్గయ్య, కాలనీ మాజీ అధ్యక్షుడు

అభివృద్ధికి నిధులు కేటాయించండి



మంత్రి శ్రీధర్‌బాబుతో స్థానిక కాంగ్రెస్ నేతలు

మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగవరం అభివృద్ధికి నిధులు కేటాయించాలని గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబును కలిశారు. నగరంలోని మంత్రి నివాసానికి మాజీ జెడ్పీటీసీ శైలజ, మాజీ సర్పంచ్ విజయానంద్‌రెడ్డిలు గ్రామ కాంగ్రెస్ నేతలతో కలిసి వెళ్లారు. గ్రామంలోని సమస్యలను వివరించి తగిన నిధులు మంజూరు చేయాలని కోరారు. కాంగ్రెస్ నేతలు ప్రకాష్‌రెడ్డి, మనస్విని రెడ్డి తదితరులున్నారు.

పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీ

ఘట్‌కేసర్: ఇంటిముందు నిలిపిన బైక్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. డీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన బంగారు చంద్రశేఖర్ 8న (టీఎస్08జేడబ్ల్యూ7743) హోండా యాక్టీవా ఇంటి ముందు పార్కు చేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం తిరిగి ఇంటికి వచ్చి చూడగా.. ఇంటి ముందు నిలిపిన వాహనం కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమాచారహక్కు చట్టంపై అవగాహన



సదస్సులో తహసీల్దార్ భూపాల్ తదితరులు

మేడ్చల్: జిల్లాలో నిర్వహిస్తున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా గురువారం మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ భూపాల్ పాల్గొని సమాచార హక్కు చట్టం గురించి వివరించారు. సదస్సుకు హాజరైన వారికి చట్టంపై అవగాహన కల్పించారు. చట్టం వల్ల చేకూరే ప్రయోజనాలు, చట్టం వల్ల సాధించే విషయాలపై వివరించారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది గుడ్ గవర్నెన్స్ టీమ్ సభ్యులు చందర్, రమేష్‌గుప్తా, ఆజామ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



నాగారంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సుర్వి బాబయ్యగౌడ్ గార్డెన్స్‌లో కమిషనర్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. గురువారం 'అంగీకార్–2025' పేరుతో కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి పథక ప్రయోజనాలు గురించి వివరించారు. మాజీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ మేనేజర్ నారాయణ రెడ్డి, డీఈఈ సంతోష్‌కుమార్, రెవెన్యూ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిరాజ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ శ్రవణ్‌కుమార్, వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లి సంబంధాలు చెడగొడుతున్నాడని..

పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి

పోచారం: పెళ్లి సంబంధాలు చెడగొడుతున్నాడని ఓ యువతి పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచారానికి చెందిన ఓ యువతి (28) కాచిగూడ ప్రాంతానికి చెందిన ఆకుల నిఖిల్ (33)ను 2015 నుంచి ప్రేమిస్తోంది. ఇద్దరు పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. కానీ, 2023లో నిఖిల్ తన తల్లిదండ్రులు కుదిర్చిన అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆమె అతడితో మాట్లాడటం మానేసింది. గత కొద్ది రోజులుగా 'నువ్వు లేకుండా నేను బతకలేను. మరొకరిని పెళ్లి చేసుకుంటే చంపేస్తా'నని బెదిరిస్తున్నాడు. యువతి ఇంట్లో వారు చూసిన పెళ్లి సంబంధాలను చెడగొడుతున్నాడని, మాట్లాడకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



ఓపెన్‌జిమ్‌కు శంకుస్థాపన చేస్తున్న కమిషనర్ శైలజ

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు దశలవారీగా కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. చెంగిచర్ల 1వ డివిజన్ పరిధిలోని క్రాంతి కాలనీలో పార్కులో బీపీఎల్ సంస్థ ద్వారా ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ఆమె గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని పార్కులు, ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దైనందిన జీవితంలో వ్యాయామం ఒక భాగమన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన పనులను త్వరతిగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మాజీ కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్, బీ– బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, నేతలు కొత్త రవిగౌడ్, రంగ బ్రహ్మన్నగౌడ్, కొత్త సుకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

రూ.13లక్షలతో యూజీడీ పనులు



యూజీడీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: డివిజన్ పరిధిలోని పూలపల్లి బాలయ్య, సూర్యానగర్ కాలనీలో రూ.13 లక్షలతో చేపట్టనున్న భూగర్భ మురుగు నీటిపారుదల వ్యవస్థ పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ గున్నా సునీతాశేఖర్‌యాదవ్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సహకారంతో నిధులు మంజూరయ్యాయని, పనులు త్వరగా పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. చాలా ఏళ్లగా కాలనీవాసులు ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం లభించనుందని తెలిపారు. సాయిబాబు, పాండురంగ గుప్తా, రామకృష్ణ, మల్లేశ్వరరావు, అశోక్, శ్రీనివాస్, నాగరాజు తదితరులున్నారు.

చలో రాజ్ భవన్‌ను విజయవంతం చేయాలి

మేడ్చల్: బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్రం వెంటనే అమోదించాలని డిమాండ్ చేస్తూ.. సీపీఎం ఆధ్వర్యంలో నేడు చేపట్టాల్సిన చలో రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమంలో మండలం నుంచి బీసీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మండల సీపీఎం కార్యదర్శి నరేష్, జిల్లా చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ సభ్యుడు కోమురయ్యలు కోరారు.

కీసర: రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కీసర మండల సీపీఎం నేతలు బంగారు నర్సింగ్‌రావు గురువారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు అమలు బిల్లును ఆమోదించాలని, పార్లమెంట్‌లో చట్టాన్ని తీసుకురావాలన్నారు. నేడు నిర్వహించే చలో రాజ్‌భవన్ కార్యక్రమానికి బీసీ వర్గాలు, సామాజిక సంస్థలు, పార్టీల నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మేడ్చల్‌రూరల్: ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ చెక్‌పోస్ట్‌లోని తనుజాలాడ్జ్ సమీపంలో ఉదయం 11గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు పక్కన పడి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు మేడ్చల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు 40–45 ఏళ్లున్న వ్యక్తిగా గుర్తించారు. ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీసిల్టింగ్ పనులు పూర్తి చేయాలి

మల్కాజిగిరి: బాలసరస్వతీనగర్‌లో కార్పొరేటర్ శ్రవణ్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను వరదముంపు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులకు పలు సూచనలు చేశారు. నాలాను హైడ్రా అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన డీసిల్టింగ్ చేయించాలన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడానికి జలమండలి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపామన్నారు. నాలాల్లో చెత్త,చెదారం వేయకుండా ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు చేయూతనందిస్తాం

మల్కాజిగిరి: డివిజన్ పరిధిలోని మహిళలకు చేయూతనందిస్తామని మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ అన్నారు. గురువారం ఎస్పీనగర్ మహిళాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మహిళా సమైక్య గ్రూపు సభ్యులకు చేయూతనందించడానికి రూ.లక్ష విరాళం అందజేశారు. జగదీష్‌గౌడ్ మాట్లాడుతూ.. గతనెల ఎమ్మెల్యే రూ.2.5లక్షలు అందజేశారన్నారు. వాటిలో కుట్టు శిక్షణకేంద్రం ఏర్పాటు చేసి మహిళలకు చేయూతనందిస్తామన్నారు. ప్రేమలత, చంద్రకళ, లలిత, శారద, జయశ్రీ, వసంత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన జాతీయస్థాయి వర్క్‌షాప్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న యూనివర్సిటీ వీసీ, ఇతర ప్రతినిధులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో మూడ్రోజుల పాటు నిర్వహించనున్న జాతీయస్థాయి వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. ఎమ్మార్‌యూ పరిధిలోని స్కూల్ ఆఫ్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ సైన్సెస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, మల్లారెడ్డి క్యాన్సర్ ఆసుపత్రి అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఐసీఎమ్ఆర్, డీహెచ్ఆర్ సహకారంతో మూడ్రోజుల పాటు నెక్స్‌జెన్ ఏఐ ఇన్ హెల్త్‌కేర్ ఫ్రమ్ ప్రిడిక్షన్ టూ ప్రిస్క్రిప్షన్ థెరపీ అనే అంశంపై వర్క్‌షాప్ సాగనుంది. రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, కన్వీనర్ అపర్ణ, వినోద్ కుమార్, సుధారమణ, అనీల్‌కౌల్, రాజేందర్‌రావు, సంగీత, జీవీరావు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఉన్నతాధికారుల సమీక్ష



కండ్లకోయ సబ్‌స్టేషన్‌లో ఉద్యోగులకు సూచనలు ఇస్తున్న అధికారులు

మేడ్చల్: వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు మేడ్చల్ డివిజన్ విద్యుత్ అధికారులకు పలు సూచనలు చేశారు. మేడ్చల్ జోన్ చీఫ్ ఇంజినీర్ కామేష్, ఎస్ఈ రవికుమార్, ట్రాన్స్‌కో సీఈ చిరంజీవి, ఎస్ఈ హరిప్రసాద్‌లు గురువారం కండ్లకోయలోని 220కేవీ, 132కేవీ సబ్ స్టేషన్లను సందర్శించి డివిజన్ అధికారులతో సమావేశం నిర్వహించిన అనంతరం పలు సూచనలు చేశారు. ప్రణాళికలు రూపొందించి వాటికి అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. డీఈలు శ్రీనాథ్‌రెడ్డి, జాన్ పోతురాజు, జ్ఞానేశ్వర్, ఏడీఈలు రాజమల్లేష్, అశోక్‌రావు, ఏఈలు విజయ్‌కుమార్, మౌలాలి, రాంబాబు, రాఘవేంద్రరావు, వెంకట్ నారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం



జవహర్‌నగర్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

జవహర్‌నగర్: కార్పొరేషన్‌లో ఎన్నో ఏళ్ల నుంచి ఉంటున్న ఇళ్లను ప్రభుత్వం కూల్చడాన్ని నిరసిస్తూ.. బీజేపీ నేతలు గురువారం జవహర్‌నగర్ ప్రధాన రహదారిపై సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. వారు మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో ఏళ్ల నాటి నుంచి నివాసం ఉంటున్న కాలనీలోకి రెవెన్యూ అధికారులు వచ్చి అక్రమమంటూ.. కూల్చడంతో పేదలు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారన్నారు. నాయకులు శంకర్, సంతోష్‌గుప్తా, లిఖితయాదవ్, సన్నీ, యాదగిరి, మహేష్‌గౌడ్, నరేష్‌యాదవ్, నవీన్, జ్యోతి, రాజునాయక్, శివప్రసాద్ పాల్గొన్నారు.

పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ప్రశాంత్‌రెడ్డి

పోచారం: విద్యార్థులు క్రమశిక్షణతో పాటు పట్టుదలతో కృషిచేస్తేనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఎస్ఎస్ఆర్‌జీ వైస్ చైర్మన్ నల్ల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు నిర్వహించిన ఓరియెంటేషన్ ప్రోగ్రాంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా తరగతులకు హాజరైతేనే పాఠ్యాంశాలపై పట్టు సాధిస్తారన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీవీ. కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను కళాశాలలో కల్పించామన్నారు. అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఫార్మసీ హెచ్ఓడీ డా.కృష్ణమోహన్, టీపీఓ శ్రీకాంత్, వివిధ విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత సమాజ అభివృద్ధికి కృషి చేయాలి



రామంతాపూర్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ గ్లోబల్ వీల్ ఫౌండేషన్ ఐఐటీ అల్యుమినీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి ఉత్సవాల్లో భాగంగా విద్యార్థి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. యువత విద్యార్థులు అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని సేవాభావంతో సమాజ నిర్మాణంతో పాటు సమాజ అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా చైర్మన్ శ్యామ్‌మోహన్ గ్లోబల్ వీల్ ఫౌండేషన్ డైరెక్టర్ ఏవీ.కృష్ణమూర్తి, లైన్స్‌క్లబ్ నారాయణ, డాక్టర్ నరసింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.